ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం 6.24(సాయంత్రం)

సెహరీ : శనివారం 4.58 (ఉదయం)

సీఎం జగన్ గొప్పల గురించి వైసీపీ నాయకుల ప్రచార ఆర్భాటానికి అంతే లేకుండా పోయింది. ఇంతకూ రాయలసీమకు జగన్ ఏం చేశారు? నిర్దిష్టంగా ఏ అభివృద్ధి పనులు చేయకుండానే గత టీడీపీ ప్రభుత్వం చేసిన పనులను తానే చేసినట్లు చెప్పుకుంటున్నారు. దీనికి తాజా ఉదాహరణ ఇటీవల చిత్తూరు జిల్లా కుప్పం బ్రాంచ్ కెనాల్‌కు హంద్రీనీవా నీటిని విడుదల చేసి, అదంతా తన ఘనతే అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చెప్పుకున్నారు. గత సీఎం చంద్రబాబు ఈ పని చేయలేకపోయారని విమర్శలు గుప్పించారు. సీఎం స్థానంలో ఉన్న వ్యక్తికి ఇలా అబద్ధాలు చెప్పడం తగునా? అని సీమ జనం ఆశ్చర్యపోయారు. నందికొట్కూరు నియోజకవర్గంలోని పగిడ్యాల మండలం ముచ్చుమర్రి లిఫ్టు స్కీంను యుద్ధ ప్రాతిపదికన అప్పటి సీఎం చంద్రబాబు పూర్తి చేసి 2017 జనవరి 2న శ్రీశైలం జలాశయం నీటిని హంద్రీనీవా కాలువకు విడుదల చేశారు. ఆ నీరే ఇప్పుడు కుప్పం బ్రాంచ్ కాలువలో ప్రవహిస్తున్నది. ఇదంతా చేసింది గత టీడీపీ ప్రభుత్వం. ఇందులో వైఎస్ జగన్ ఘనత ఏముంది? ఈ సంగతి ప్రజలకు తెలుసు. కానీ జగన్ ఈ అభివృద్ధినంతా తన ఖాతాలో వేసుకోడానికి వెనుకాడటం లేదు.



జగన్ గొప్పేముంది..!

- ముందు చూపుతో ముచ్చుమర్రి లిఫ్టు నిర్మించిన చంద్రబాబు
- చిన్న పనులు కూడా చేయకుండా అటకెక్కించిన జగన్
- ముచ్చుమర్రి మరో పట్టిసీమ అని వైసీపీ నేతలకు తెలుసా?
- రాయలసీమకు ఏం చేశారని జనం ముందుకు వస్తారు?

కర్నూలు(అగ్రికల్చర్), మార్చి 21: రాయలసీమ అభివృద్ధి మీద చంద్రబాబునాయుడికి సంపూర్ణమైన అవగాహన ఉంది. దాన్ని అమలు చేసే క్రమంలోనే ముచ్చుమర్రి లిఫ్ట్‌ను నిర్మించారు. దీని వల్ల రాయలసీమకు పుష్కలంగా నీరు అందుతోంది. సీమ ప్రజలు ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అభినందనల వర్షం కురిపించారు. శ్రీశైలం జలాశయం నీటిని ముచ్చుమర్రి లిఫ్టు స్కీం నుంచి హంద్రీనీవా కాలువకు విడుదల చేసి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మంది ప్రజలకు తాగునీటిని అందించే బృహత్తర పథకాన్ని చంద్రబాబు పూర్తి చేశారు. ఈ ఘనత పూర్తిగా చంద్రబాబుకే దక్కుతుంది. ముచ్చుమర్రి లిఫ్టు స్కీంను ముందు చూపుతో గత టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయకపోయి ఉంటే.. ఈరోజు శ్రీశైలం జలాశయం నీరు హంద్రీనీవా కాలువ ద్వారా రాయలసీమకు అందించే పరిస్థితి ఉండేది కాదని నీటి పారుదల శాఖ అధికారులు కూడా చెబుతున్నారు. నిజంగా రాయలసీమపై ఏ మాత్రం అభిమానం జగన్‌కు ఉండి ఉండింటే ఎంతో ప్రాధాన్యత ఉన్న ముచ్చుమర్రి లిఫ్టు స్కీంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శ్రద్ధ పెట్టి ఉండేవారు. ఆయన తన పాలనాకాలం ముగిసిపోయిందేగాని, ముచ్చుమర్రి లిఫ్ట్ పనులను కనీసంగా పట్టించుకోలేదు. ఇది రాయలసీమ మీద వైసీపీ చిత్తశుద్ధికి నిదర్శనం అని రైతులు అంటున్నారు.



డెడ్ స్టోరేజీలో కూడా కేసీ కెనాల్, హంద్రీ నీవా కాలువకు నీరు

శ్రీశైలం జలాశయంలో ఈ సంవత్సరం గతంలో ఎన్నడూ లేని విధంగా నీటి నిల్వలు రెండు నెలల కిందే తగ్గిపోవడం మొదలైంది. తుంగభద్ర జలాశయంలో కూడా నీటి నిల్వలు కూడా తగ్గిపోయి ఎల్లెల్సీతో పాటు 2.65 లక్షల ఎకరాలకు సాగునీరందించే కేసీ కెనాల్‌కు కూడా నీరు విడుదలయ్యే అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో ముచ్చుమర్రి లిఫ్టు స్కీం ద్వారా శ్రీశైలం జలాశయంలో డెడ్ స్టోరేజీకి నీటి నిల్వలు తగ్గినా అంటే 789 అడుగుల వద్దకు నీరు చేరినా.. ముచ్చుమర్రి నుంచి నీటిని కేసీ కెనాల్‌తో పాటు హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసే అవకాశం కలిగింది. కేసీ కెనాల్‌కు రెండు పంపుల ద్వారా గత రెండు నెలల నుంచి అధికారులు నీరు అందిస్తున్నారు. అదేవిదంగా హంద్రీనీవా కాలువ ద్వారా మల్యాలకు పంపి అక్కడ లిఫ్టు నుంచి కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాలోని కుప్పంకు నీటిని అందిస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 817 అడుగుల వద్ద నీటి నిల్వలు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ముచ్చుమర్రి లిఫ్టు స్కీం లేకుంటే.. వేసవి కాలంలో శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజీకి పడిపోయిన సమయంలో అటు కేసీ కెనాల్‌కు, ఇటు హంద్రీనీవా కాలువకు నీటిని అందించే అవకాశమే లేకుండా పోయేదని నీటి పారుదల శాఖ అధికారులు అభిప్రాయ పడుతున్నారు.



● కుప్పం బ్రాంచ్ కాలువకు నీరు ముచ్చుమర్రి పుణ్యమే..!

శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గిపోతున్న సమయంలో ఆ నీటిని రాయలసీమకు హంద్రీనీవా కాలువ ద్వారా పంపేందుకు ముచ్చుమర్రి లిఫ్టు స్కీంను సుమారు రూ.387 కోట్లతో 16 పంపులతో గత టీడీపీ ప్రభుత్వం నిర్మించింది. ఈ 16 పంపుల్లో నాలుగు పంపులతో కేసీ కెనాల్‌కు, 12 పంపుల ద్వారా హంద్రీనీవా కాలువకు నీరు విడుదల చేయాలని టీడీపీ ప్రభుత్వంలో నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైలం జలాశయంలో వెనుకతట్టు జలాలను ముచ్చుమర్రి పంప్ హౌస్‌వద్దకు చేర్చేందుకు రూ.54 కోట్లతో అప్రోచ్ కెనాల్ పనులను ఆనాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. ఈ సంవత్సరం రెండు నెలలపాటు ముచ్చుమర్రి లిఫ్టు స్కీం ద్వారానే కేసీ కెనాల్‌కు, హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేయడం వల్ల కేసీ ఆయకట్టులో పంటలు సాగయ్యాయి. హంద్రీనీవా కాలువకు ముచ్చుమర్రి లిఫ్టు స్కీం నుంచి నీటిని విడుదల చేయడం వల్ల తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్న డోన్, పాణ్యం, పత్తికొండ, కోడుమూరు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందాయి. ఈ లిఫ్టు ప్రారంభోత్సవంలో చంద్రబాబు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేంత వరకు పట్టిసీమ లిఫ్టు స్కీం ఏ విధంగా ఉపయోగపడుతుందో.. అదే విధంగా ముచ్చుమర్రి లిఫ్టు స్కీం కూడా శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినప్పుడు ముచ్చుమర్రి లిఫ్టు స్కీం ద్వారా కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు నీరు అందిస్తుందని అన్నారు. ముచ్చుమర్రి మరో పట్టిసీమగా రాయలసీమకు ఉపయోగపడటం తథ్యమని ప్రకటించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా నీటి పారుదల నిర్మాణాలను ఏ ప్రభుత్వం అభివృద్ధి అభివృద్ధి చేసినా అభినందించే సంస్కృతిని వైఎస్ జగన్ రెడ్డి మరిచిపోయారని, అందుకే పెండింగ్ పనులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ముచ్చుమర్రి లిఫ్టు స్కీం వల్లే కుప్పంకు తన చేతుల మీదుగా నీరందించే అవకాశం దక్కిందనే సంగతి మరిచిపోయి, చంద్రబాబును విమర్శించడం దారుణమని రాయలసీమ ప్రజలు విమర్శిస్తున్నారు. ముచ్చుమర్రి మరో పట్టిసీమ అని వైసీపీ నాయకులకు తెలిస్తే బాగుండని అంటున్నారు.



2017లో నాటి సీఎం చంద్రబాబు ముచ్చుమర్రి లిఫ్టు స్కీంను ప్రారంభిస్తున్న దృశ్యం

రాయలసీమ ద్రోహి.. జగన్



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాయలసీమపై కపట ప్రేమ మాత్రమే చూపిస్తున్నారు. కరువు పరిస్థితులు నివారించేందుకు హంద్రీనీవా ప్రాజెక్టుకు కేవలం రూ.150 కోట్లు ఇస్తే.. ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో 40వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే.. జగన్మోహన్ రెడ్డి ఈ నిధులను కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. అదే విధంగా ముచ్చుమర్రి లిఫ్టు స్కీం పెండింగ్ పనులను పూర్తి చేయలేదు.

- వై. నాగేశ్వరరావు యాదవ్, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్

ముచ్చుమర్రి పెండింగ్ పనుల పూర్తిపై శ్రద్ధ ఏదీ...?

మరో పట్టిసీమగా గుర్తింపు పొందిన ముచ్చుమర్రి లిఫ్టు స్కీం ప్రాజెక్టుకు 16 పంపులను ఏర్పాటు చేయాల్సి ఉంది. అదే విధంగా శ్రీశైలం జలాశయం నుంచి ముచ్చుమర్రి పంప్‌హౌస్ వద్దకు నీటిని మళ్లించేందుకు 6 కి.మీల దాకా అప్రోచ్ కెనాల్‌కు గత టీడీపీ హయాంలో రూ.387 కోట్ల నిధులను కేటాయించింది. అయితే పెండింగ్ పనులు పూర్తి చేయడంలో వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడం లేదనే ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. అప్రోచ్ కెనాల్ 6 కి.మీల మేర తవ్వాల్సి ఉండగా.. వివిధ కారణాల వల్ల ఈ పనులను ఐదేళ్ల కావస్తున్నా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది. 16 పంపులకు గాను 4 పంపులను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం శ్రద్ధ చూపి ముచ్చుమర్రి లిఫ్టు స్కీం పెండింగ్ పనులు పూర్తి చేసి రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వానికి మొర పెట్టుకుంటున్నారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు



ఈవీఎంల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

నంద్యాల (కల్చరల్), మార్చి 21: పోలింగ్ రోజు ఈవీఎంల పని తీరులో సమస్యలు తలెత్తకుండా సంపూర్ణ శిక్షణ పొంది పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు అవగాహన కల్పించాలని జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లను కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో ఈవీఎంల పని తీరుపై జిల్లా అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డిఆర్వో పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ అధికారులకు ఈవీఎం యంత్రాల పనితీరుపై సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. బ్యాలట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాడ్‌ల పనితీరుపై సంపూర్ణ శిక్షణ పొందాలని జిల్లా, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లను ఆదేశించారు. ఈవీఎంలో తరచూ వచ్చే సమస్యలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలన్నారు. ఈవీఎంలపై అవగాహన లేకపోవడం వల్లే 50శాతం సమస్యలు వస్తాయన్నారు. ఏజంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించిన అనంతరం తప్పనిసరిగా ఇన్ఫర్మేషన్ మొత్తం క్లియర్ చేసుకోవాలన్నారు.. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను మొదటి రాండమైజేషన్ పద్ధతిలో అసెంబ్లీ నియోజకవర్గాలకు, రెండో రాండమైజేషన్ పద్ధతిలో పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తామని కలెక్టర్ వివరించారు. జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈవీఎంల పనితీరుపై సెక్టోరల్ అధికారులకు అవగాహన వుండాలన్నారు. ఈవీఎంలోని విభాగాలు పనితీరును స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు ఈవీఎంల పనితీరుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించి, శిక్షణకు హాజరైన వారితో ఆపరేట్ చేయించారు.

బనగానపల్లె ఈవోఆర్‌డీ శివరామయ్య బదిలీ

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి ఫిర్యాదుతో చర్యలు

బనగానపల్లె, మార్చి 21: బనగానపల్లె ఈవోఆర్డీ శివరామయ్యను గురువారం కలెక్టరు శ్రీనివాసులు బదిలీ చేశారు. బనగానపల్లెలో ఈవోఆర్డీ రాజకీయ శక్తిగా మారారని, అతనిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో పూర్తి స్థాయిలో విచారణ జరిపి ఆయనను ఆత్మకూరు మండలం కొత్తపల్లె మండల ఈవోఆర్డీగా బదిలీ చేశారు. బనగానపల్లెలో ఈవోఆర్డీగా పని చేస్తున్న శివరామయ్య ఎంపీడీవోలా పెత్తనం చేస్తున్నారని, ఎన్నికల నియమ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారంటూ బీసీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సీఈవో విచారణ జరిపి శివరామయ్యను బదిలీ చేయాలని కలెక్టరుకు నివేదించారు. కోవెలకుంట్ల ఈవోఆర్డీగా పనిచేస్తున్న రాధికను బనగానపల్లె ఈవోఆర్డీగా నియమిస్తూ డీపీవో ఉత్తర్వులు జారీచేశారు.

వేణుగోపాల స్వామి అలంకారంలో దర్శనం



వేణుగోపాలస్వామి అలంకారంలో జ్వాలా నరసింహస్వామి

నంద్యాల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జ్వాలా నరసింహ స్వామి గురువారం వేణుగోపాలస్వామి అలంకారంలో భక్తులకు దర్శనం చేయించారు. అనంతరం చూర్ణాభిషేకం నిర్వహించారు. ముందుగా ఎగువ అహోబిలంలో జ్వాలా నరసింహ స్వామికి ఉత్సవం, అభిషేకం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. స్వామివారు పొన్న చెట్టు వాహనంపై రాత్రి విహరించారు.

దిగువ అహోబిలంలో

అహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం ప్రహ్లాద వరద స్వామిని మోహిని అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆ తరువాత అభిషేకం నిర్వహించారు. రాత్రి శరభ వాహనంపై వాహనంపై విహరించారు. కాగా ఎగువ అహోబిలంలో శుక్రవారం తిరుమంజనం, గజ వాహనం, తిరు కళ్యాణోత్సవం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహిస్తారు. దిగువ అహోబిలంలో వేణుగోపాలస్వామి అలంకారం, చుర్ణాభిషేకం, అభిషేకం, రాత్రి పొన్నచెట్టు వాహనం కార్యక్రమాలను చేపడతారు.

వైసీపీ సేవలో సచివాలయ ఉద్యోగి..!

ఆత్మకూరు, మార్చి 21: పట్టణంలోని 7వ వార్డులో గల కొత్తపేట కాలనీలో వెలుగోడు ఒకటో సచివాలయానికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ గౌస్ ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరించారు. ఆత్మకూరు పట్టణానికి చెందిన వలంటీర్లు ఎన్నికల ప్రచారాలకు పాల్పడితే ప్రతి పక్ష పార్టీల నాయకులు గుర్తిస్తారని వెలుగోడుకు చెందిన సచివాలయ ఉద్యోగి గౌస్‌ను ఆత్మకూరుకు పిలిపించారు. ఇతనితోపాటు ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న ఫయాజ్, 3, 4 వార్డుల సచివాలయాల గృహ సారథులు ఇబ్రహీం, నజిముద్దీన్‌లు స్థానిక వైసీపీ నాయకుడు ఎన్ఎస్ రషీద్‌తో కలిసి 7వ వార్డులోని ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా ఓటరు జాబితా ప్రకారం ఓటర్ల సెల్ నంబర్లు, బ్యాంకు అకౌంట్ వివరాలను సేకరించారు. ఇది గమనించిన అదే వార్డుకు చెందిన టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి షాబుద్దీన్ వారిని నిలదీశారు. సచివాలయ ఉద్యోగిగా ఉంటూ ఓటర్లను ప్రభావితం చేయడమేమిటని ప్రశ్నించారు. అదేవిధంగా సీ విజిల్ యాప్ ద్వారా సదరు సచివాలయ ఉద్యోగి గౌస్, మున్సిపల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఫయాజ్‌పై ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే గౌస్ ఎన్నికల కోడ్ రాక ముందు వరకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి వ్యక్తిగత కార్యదర్శిగా కొనసాగినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై సంబంధిత ఎన్నికల అధికారులు ఎలా వ్యవహరిస్తారో వేచి చూడాలి మరి.

సీ విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు



వైసీపీ నాయకులతో కలిసి ఓటర్ల వివరాలను సేకరిస్తున్న సచివాలయ ఉద్యోగి

సమాజ హితవు కోరేదే కవిత్వం

తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న



గోరటి వెంకన్నను సన్మానిస్తున్న ఆర్జీఎం చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు

పాణ్యం, మార్చి 21 : సమాజ హితవు కోరేదే కవిత్వమని ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పేర్కొన్నారు. అంతర్జాతీయ కవితా దినోత్సవం సందర్భంగా గురువారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఇంగ్లీషు విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజానికి కవిత్వం ఎంతో అవసరమన్నారు. దుర్మార్గాన్ని, దౌర్జన్యాన్ని, మౌఢ్యాన్ని, అమానుషత్వాన్ని కవి హృదయం అంగీకరించదన్నారు. ప్రపంచ గతిని మార్చే శక్తి ఒక్క కవిత్వానికే ఉందన్న నిజాన్ని ఎందరో కవులు నిరూపించారన్నారు. గురజాడ కన్యాశుల్కం లేకుంటే ముదుసలికి కన్యతో పెళ్లి రద్దయ్యేదే కాదన్నారు.. చింతామణి నాటకం లేకుంటే వేశ్యావృత్తి కొనసాగేదన్నారు. శ్రీశ్రీ కవిత్వం లేకుంటే రాచరికం ఇంకా ఉండేదని అన్నారు. జాషువా, కృష్ణ శాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, కట్టమంచి రామలింగారెడ్డి వంటి కవులే కాకుండా వాజ్‌పేయి, పివి నరసింహారావు వంటి రాజకీయ ప్రముఖులు తమ కవిత్వంతో సామాజిక చైతన్యం తెచ్చారన్నారు. తను కరిగి ఇతరులకు వెలుగు చూపించేదే కవిత్వమన్నారు. కవులు నిరంతరం కష్టజీవుల పక్షమేనన్నారు. ఈ సందర్భంగా వివిధ భాషల్లో ప్రచురించిన కవితా పరిశోధనల సంపుటిని ఆయన ఆవిష్కరించారు. తెలంగాణ విద్యార్థులకు ఇప్పటి వరకు రెండు రాష్ట్రాల నుంచి స్కాలర్‌షిప్‌లు అందలేదని ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యను తెలంగాణ గవర్నర్, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గోరటి వెంకన్న అన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మిద్దె శాంతిరాముడు, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్ గోరటి వెంకన్నను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యాఖ్యాత డాక్టర్ ప్రతిమా రాయ్, హెచ్ఓడీ డాక్టర్ కౌసర్‌బాషా, కన్వీనర్ డాక్టర్ సునీత, కోఆర్డినేటర్ డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు మెటల్ క్యారీల సర్వేలు

కర్నూలు(అర్బన్), మార్చి 21: జిల్లాలో రెండు ప్రాంతాల్లో రోడ్డు మెటల్ క్యారీల కోసం సర్వేలు నిర్వహించామని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం ఓర్వకల్లు మండలం బోడ్డువాని పల్లె 485 సర్వే నెంబర్, కల్లూరు మండలం చెట్ల మల్లాపురం గ్రామంలో 135 సర్వే నంబర్లలో రోడ్డు మెటల్ క్యారీల కోసం సర్వేలు నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం మూడు క్యారీలను ఎంపిక నిర్ధారించామని పేర్కొన్నారు. ఈ సర్వేల్లో సూపర్‌వైజర్లు పురేందర్, దీలీప్ తదితరులు పాల్గొన్నారు.

28న జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు

కర్నూలు(లీగల్), మార్చి 21: కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్‌కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు ఈ నెల 28న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి న్యాయవాది కె. మోహన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఈ నెల 23లోగా నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. 25న నామినేషన్ల ఉపసంహరణ, 26న పోటీ చేసే అభ్యర్థులు తమ అభ్యర్థిత్వంపై స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో సభ్యులకు విన్నవించుకోవచ్చని తెలిపారు. 28వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ జరుగుతుందని, ఆ తర్వాత వెంటనే కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఎన్నికల సహాయకులుగా న్యాయవాదులు బి.గోపాలకృష్ణుడు, ఎస్.బాబు సాహెబ్ ఉంటారని ఆ ప్రకటనలో తెలిపారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 21: 2024-25 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ డిప్లమా కోర్సుల్లో ప్రవేశం కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కర్నూలు మైనార్టీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.చక్రవర్తి గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థులు పదో తరగతి, తత్సమాన పరీక్షలు ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు దరఖాస్తు రుసుం రూ.400 ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తు రుసుం రూ.100 చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5 చివరి తేదీ అన్నారు. ఆన్‌లైన్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 9949571971, 9494834320 నెంబర్లను సంప్రదించాలని ఆయన తెలిపారు.

మైనార్టీలకు ఉచితంగా నీట్, ఈపీ సెట్ శిక్షణ

కర్నూలు(అర్బన్), మార్చి 21: ఉస్మానియా కళాశాలలో రీజినల్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ ఆధ్వర్యంలో ఈపీ సెట్, నీట్ ఎంట్రన్స్ పరీక్షలో మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తామని సంస్థ డైరెక్టర్ సయ్యద్ సమీవుద్దీన్ ముజ్జామిల్ ఒక ప్రకనటలో తెలిపారు. పరీక్షలు రాసే క్రైస్తవులు, ముస్లిం, దూదేకుల, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారసీల వంటి మైనార్టీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈనెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్మీడియట్ హాల్ టికెట్ నీట్/ఈపీసెట్ 2024 ఆన్‌లైన్ ఫామ్, ఆధార్ కార్డు, 2పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, జత చేసి ఉస్మానియా కళాశాలలోని రూమ్ నెంబర్ 54లో ఇవ్వాలని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ 9441761178, 9849896996లో సంప్రదించాలన్నారు.

గర్భిణులకు టిఫా స్కానింగ్ తప్పనిసరి: డీఎంహెచ్‌వో

కర్నూలు(హాస్పిటల్), మార్చి 21: గర్భిణులకు టిఫా స్కానింగ్ తప్పనిసరి అని డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో మూడు స్కానింగ్ కేంద్రాలను గురువారం ఉదయం తనిఖీ చేశారు. స్కానింగ్ కేంద్రాల్లో ఫాం-ఎఫ్ అప్‌లోడు చేస్తున్నారా..? లేదా అని ప్రశ్నించారు. గర్భిణులకు ఖరీదైన టిఫా స్కానింగ్ చేయాలని, ఆరోగ్యశ్రీ నుంచి ఉచితంగా నిర్వహించాలని స్కానింగ్ కేంద్రాలను ఆదేశించారు. ప్రతి స్కానింగ్ కేంద్రం పీసీపీఎన్‌డీఈ యాక్టు ప్రకారం రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. డీఎంహెచ్‌వో వెంట డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

డౌన్ సిండ్రోమ్ ఓ జన్యుపరమైన సమస్య

కర్నూలు(హాస్పిటల్), మార్చి 20: పిల్లల్లో కనిపించే జన్యుపరమైన అనారోగ్య సమస్యల్లో డౌన్ సిండ్రోమ్ ఒకటని కర్నూలు డీఎంహెచ్‌వో వై.ప్రవీణ్ కుమార్ అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చర్ గ్యాలరీలో ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినం సందర్భంగా గురువారం ఆర్‌బీఎస్‌కే వైద్యులు, తల్లులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడారు. డౌన్ సిండ్రోమ్ పిల్లలు అందరి మాదిరిగానే పుడుతారని, కానీ ఎదిగే కొద్ది రకరకాల సమస్యలు మొదలవుతాయని అన్నారు. పిల్లల ముఖం భిన్నంగా కనిపిస్తుందని తెలిపారు. చిన్నపిల్లల విభాగాధిపతి విజయానందబాబు మాట్లాడుతూ ఈ వ్యాధితో బాధపడే పిల్లల్లో శారీరక పెరుగుదల ఉండదని, బుద్ధిమాంద్యం, చురుకుదనం లోపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. గర్భిణీ దశలోనే డాక్టర్ల సలహా మేరకు వైద్యం తీసుకున్నట్లయితే జన్యుపరమైన సమస్యను నివారించవచ్చునని తెలిపారు. గర్భస్థ శిశువులు జన్యులోపాలను ముందుగానే మూయకిల్ ట్రాన్స్‌యెన్సి (ఎన్‌టీ) స్కాన్ పరీక్ష ద్వారా గుర్తించవచ్చునని చెప్పారు. ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శైలేష్ కుమార్, కర్నూలు జీజీహెచ్ చిన్న పిల్లల విభాగం ప్రొఫెసర్లు సుహాసిని, శారద, అసోసియేట్ ప్రొఫెసర్లు ప్రకాష్‌కుమార్, శ్రీలత, అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృష్ణ, ప్రకాష్, ఆనంద్, హిమబిందు, లక్ష్మీనారాయణ, సుధాప్రియ, డైస్ చిన్న పిల్లల వైద్యులు సృజన, డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ప్రొజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.



సీ విజిల్ దుర్వినియోగం!

- సామాన్యుడి చేతిలో వజ్రాయుధం
- పక్కా ఆధారాలు కీలకం
- మొక్కుబడి ఫిర్యాదులతో అధికారుల ఇబ్బందులు
- జిల్లాలో 46 ఫిర్యాదులు.. 28 పరిష్కారం

కర్నూలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమల్లోకి వచ్చింది. కోడ్ ఉల్లంఘనులపై కొరడా చర్యలు తీసుకోడానికి కేంద్ర ఎన్నికల సంఘం సీ విజిల్ యాప్ తెచ్చింది. దీన్ని పక్కా ఆధారాలతో వినియోగిం చుకుంటే సామాన్యుల చేతిలో వజ్రాయుధంగా సి విజిల్ పని చేస్తుంది. ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లో పరిష్కారం చేస్తారు. అయితే.. కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల కోడ్ అమలు చేసే అధికారులు ఇబ్బందుకుల గురౌతున్నారు. సమయం కూడా వృథా అవుతుంది. పక్కా సమాచారం.. ఆధారాలతో ఉపయోగించుకోవాలని ఎన్నికల అధికారులు కోరుతున్నారు.

పార్లమెంట్ సహా రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఈ నెల 16న కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూలు జారీ చేసింది. అదే రోజు నుంచి ఎన్నికల ప్రవర్తనా నియామవళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) అమల్లోకి వచ్చింది. 24 గంటల్లో ప్రభుత్వ అధికారుల కార్యాలయాలు, ఆవరణల్లో, 48 గంటల వ్యవధిలో ఆర్టీసీ బస్టాండులు, రోడ్డు వైపు, పార్కులు, రైల్వే స్టేషన్లు.. వంటి పబ్లిక్ స్థలాల్లో, 72 గంటల్లో ప్రైవేటు స్థలాల్లో ఉన్న ఉన్న రాజకీయ పార్టీలు, నాయకులు ఫ్లెక్సీలు, ఫొటోలు, పోస్టర్లు, హోర్డింగ్స్ సహా ప్రభుత్వ సంక్షేమ పథకాల పోస్టర్లను తొలగించామని అధికారులు పేర్కొన్నారు. గురువారం వరకు ప్రభుత్వ, పబ్లిక్ స్థలాల్లో 15,115, ప్రైవేటు స్థలాల్లో 5,647 గోడ రాతలు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, హోర్డింగ్స్ తొలగించారు. అదే క్రమంలో సి విజిల్ యాప్‌లో 46 ఫిర్యాదులు రాగా.. 28 ఫిర్యాదులను విచారించి నిజమని తేలడంతో శాఖపరమైన చర్యలు తీసుకున్నారు. మరో 18 ఫిర్యాదులకు ఎలాంటి ఆధారాలు లేవని అధికారులు వివరించారు.

సీ విజిల్‌కు వచ్చిన ఫిర్యాదులు, పరిష్కారం

నియోజకవర్గం	ఫిర్యాదులు	పరిష్కారం	100 నిమిషాల్లో పరిష్కారమైనవి	శాతం
ఆదోని	3	1	1	100
ఆలూరు	2	1	--	--
కోడుమూరు(ఎస్సీ)	4	--	--	--
కర్నూలు	19	17	17	100
మంత్రాలయం	1	--	--	--
పాణ్యం	9	5	1	20
పత్తికొండ	8	4	1	25
ఎమ్మిగనూరు	--	--	--	--
మొత్తం	46	28	20	71

● సీవిజిల్ దుర్వినిగం చేయవద్దు!

కర్నూలు నగరం సంకల్పాగ్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సి విజిల్‌లో ఓ ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఎంసీసీ అధికారులు సంబంధిత వ్యక్తికి ఫోన్ చేసి పూర్తి వివరాలు చెప్పాలని కోరగా.. అధికారులు పని చేస్తారో లేదో తెలుసుకుందామని అప్‌లోడ్ చేశాను..! అని సమాధానం రావడంతో అధికారులు అవాక్కయ్యారు. ఆ వెంటనే సదరు వ్యక్తి తన ఫిర్యాదును సీ విజిల్‌లో డిలిట్ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం వజ్రాయుధం లాంటి సీ విజిల్ సామాన్యుల చేతికి ఇస్తే.. దురుద్దేశం వల్ల, ఆకతాయితనం వల్ల దుర్వినియోగం కూడా అవుతున్నది. దీని వల్ల అధికారుల సమయం వృథా అవుతుంది. సి విజిల్‌లో ఫిర్యాదు రాగానే జిల్లా కోడ్ ఆఫ్ కాండక్ట్ (డీసీసీ) నుంచి ఎఫ్ఎస్‌టీకి 5 నిమిషాల్లో వెళ్తుంది. ఆ టీం 15 నిమిషాల్లో సంబంధిత ప్రదేశానికి చేరుకోవాలి. 30 నిమిషాల్లో విచారించి ఆ నివేదికను కలెక్టరుకు పంపాలి. 50 నిమిషాల్లో కలెక్టరు ఆ నివేదికపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఇంత వేగంగా పని చేయాల్సిన ఈ సమయంలో ఆధారాలు, వివరాలు లేని ఫిర్యాదులు చేయడం వల్ల డీసీసీ నుంచి ఎఫ్ఎస్‌టీ వరకు సమయం వృథా చేయడమే అవుతుంది.

సరైన ఆధారాలతో వినియోగించుకోవాలి



ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత సి విజిల్ ద్వారా 48 ఫిర్యాదులు వచ్చాయి. తక్షణమే ఎఫ్ఎస్‌టీలను పంపించి విచారణ చేయించి 100 నిమిషాల్లో పరిష్కరించాం. ఆధారాలు, పక్కా సమాచారంతో వచ్చిన 28 ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నాం. మరో 16 ఫిర్యాదులకు ఎలాంటి ఆధారాలు లేవు. కొందరు సీ విజిల్ యాప్‌ను దుర్వినియోగం చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల సమయం వృథా అవుతున్నది.

-జి. నాసరరెడ్డి, ఎంసీసీ కో-ఆర్డినేటర్, జడ్పీ సీఈఓ, కర్నూలు

జగన్ జైలుకెళ్లడం ఖాయం

- వైసీపీ కథ ముగిసింది
- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, మార్చి 21: రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో వైసీపీ చిత్తుగా ఓడిపోవడం ఖాయమని, జగన్ జైలుకు వెళ్ళడం తథ్యమని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. గురువారం డీసీసీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ జగన్ పని అయిపోయిందని, వైసీపీ నాయకులంతా కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలని పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలు జగన్ పాలనపై అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్నారన్నారు. జగన్ పార్టీని ఓడించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. అప్పులు, అవినీతి, అరాచక, మద్యం, జూదం, గంజాయి తదితర సంఘ విద్రోహాలకు నిలయంగా ఏపీని సీఎం జగన్ మార్చేశాడని అన్నారు. భూ దందాలు, రేషన్ మాఫియా, ఎర్రచందనం స్మగ్లింగ్, మైనింగ్ దోపిడీతో వైసీపీ ముఠాలు వేల కోట్ల రూపాయల అక్రమార్జనకు పాల్పడుతున్నారని విమర్శించారు. వివేకా హత్య కేసు వ్యవహారంలో జగన్ ప్రతిష్ఠ, పరువు అథఃపాతాళానికి చేరాయన్నారు. వైఎస్సార్ ఆశయాన్ని నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీని ప్రజలందరూ ఆశీర్వదించాలని, రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని పిలుపునిచ్చారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు బోయ రమణ, పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, శ్రీరాములు పాల్గన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

లింక్ ఓపెన్ చేయగానే రూ.50 వేలు మాయం

వలంటీర్ అకౌంట్ నుంచి లాగేసిన సైబర్ నేరగాళ్లు

హొళగుంద, మార్చి 21 : సైబర్ మోసాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి పట్టణం, పల్లె అన్న తేడా లేకుండా కేటుగాళ్లు కొత్త కొత్త పద్ధతుల్లో జనం డబ్బులు దోచుకుంటున్నారు. అలాంటి సంఘటనే హొళగుందలో చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన బోయ కరిబేష్, ఏడో వార్డుకు వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే బుధవారం రాత్రి వలంటీర్ గ్రూపులో గుర్తు తెలియని వ్యక్తి సీఎస్సీ సర్వీస్ జాయిన్ యాప్ లింక్ పెట్టాడు. దీంతో వలంటీర్ తన మొబైల్‌లో డౌన్‌లోడ్ చేశాడు. అంతే.... ఐదు క్షణాల్లో యాప్ మాయమైపోయింది. అది కనిపించకపోవడంతో ఫోన్ పక్కన పెట్టేశాడు. గురువారం ఉదయం 10 గంటల సమయంలో మొబైల్‌కు మెసేజ్‌లు రావడంతో వాటిని చూసిన వలంటీర్ ఖంగుతిన్నాడు. తన ఎస్‌బీఐ అకౌంట్ నుంచి ఐదు రూ.5వేలు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.25 వేలు, ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.20వేలు విత్ డ్రా చేసినట్లు మెసేజ్ రావడంతో గగ్గోలు పెడుతున్నాడు. మోసపోయానని గుర్తించిన వలంటీర్ వెంటనే బ్యాంకు సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఫోన్‌లోని సిమ్‌కార్డు తొలగించాలని, సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారని తెలిసింది.



హొళగుందలో సైబర్ నేరగాళ్లు ఫోన్‌కు పంపిన లింక్‌ను చూపుతున్న వలంటీర్ కరిబేష్

'చెరుకులపాడులోకి అనుమతించండి..'

కర్నూలు(కలెక్టరేట్), మార్చి 21: వెల్దుర్తి మండలం చెరుకులపాడుకు చెందిన 30 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను గ్రామంలోకి అనుమతించాలని టీడీపీ జనరల్ సెక్రటరీ ఎల్‌వీ ప్రసాద్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకులపాడుకు చెందిన టీడీపీ కార్యకర్తలు పి.రామాంజనేయులు, బి.రామాంజనేయులు, ఎం.పెద్దయ్య, కె.రామక్రిష్ణ, చాకలి సుబ్బారావుల కుటుంబాలకు చెందిన 30 మందిని ఎమ్మెల్యే శ్రీదేవి గ్రామంలోకి రానివ్వకుండా అడ్డుపడుతున్నారని అన్నారు. అలాగే గత ఎన్నికల్లో దొంగ ఓట్లు ఎక్కువగా నమోదయ్యాయని, చెరుకులపాడులో టీడీపీకి చెందిన పోలింగ్ ఏజెంట్లు లేకపోతే మళ్లీ దొంగ ఓట్లు పడే అవకాశం ఉందని తెలిపారు.

ఫార్మసీ ఆఫీసర్ల జిల్లా సమావేశం

కర్నూలు(హాస్పిటల్), మార్చి 21: వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పని చేస్తున్న ఉమ్మడి జిల్లా ఫార్మసీ ఆఫీసర్ల కార్యవర్గ సమావేశం గురువారం రాత్రి డీఎంహెచ్‌వో ఆవరణలో జరిగింది. సమావేశానికి ఏపీ ఫార్మసీ ఆఫీసర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగస్వామి అధ్యక్షత వహించారు. గ్రేడ్-2 ఫార్మసిస్టును ఫార్మసీ ఆఫీసర్‌గా, గ్రేడ్-1 ఫార్మాసిస్టును సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌గా, ఫార్మసీ సూపర్‌వైజర్‌ను చీఫ్ ఫార్మసీ ఆఫీసర్‌గా మార్చినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రాజేష్ నాయక్, నాయకులు సత్యప్రసాద్, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ, వై.ప్రసాద్‌రావు, జేసీ తిమ్మప్ప, వీరాంజనేయులు, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం : కలెక్టర్

ఆదోని, మార్చి 21: ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు వజ్రాయుధం లాంటిదని కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. అలాంటి ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గురువారం ఆదోని మున్సిపల్ గ్రౌండ్ నుంచి భీమాస్ సర్కిల్ వరకు స్వీప్ పేరుతో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ కృష్ణకాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటు వేయడం ప్రజలందరి బాధ్యత అన్నారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ మే 13వ తేదీన ఎన్నికలు జరుగతాయన్నారు. ఓటర్లకు పూర్తి స్థాయిలో భరోసా ఇచ్చేందుకు పోలీసులు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఎస్పీ శివనారాయణ స్వామి, తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ



ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో కోట్ల కుటుంబానిది ప్రత్యేక ముద్ర. ఎన్నో రాజకీయ సమీకరణల మధ్య కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అసెంబ్లీ బరిలో దిగారు. తన పేరును ప్రకటించినప్పటి నుంచి కోట్ల దూకుడు పెంచారు. డోన్ నియోజకవర్గ రాజకీయాల్లో తనదైన శైలితో పట్టు బిగిస్తున్నాడు. టీడీపీ మరింత బలోపేతం చేసేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి జంపయ్యారు. ఈ పరిణామాలు డోన్ నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో అలజడి సృష్టిస్తున్నాయి.

కోట్ల దూకుడు

- డోన్ నుంచి మొదటిసారి బరిలో..
- వ్యూహాత్మకంగా అడుగులు
- టీడీపీ గూటికి వైసీపీ నాయకులు
- అధికార పార్టీలో అలజడి

డోన్, మార్చి 21: ఉమ్మడి కర్నూలు జిల్లా రాజకీయాల్లో కోట్ల కుటుంబానికి ఎంతో చరిత్ర ఉంది. దివంగత కోట్ల విజయభాస్కర్ రెడ్డి రెండు సార్లు ముఖ్యమంత్రిగా, పలుమార్లు కేంద్ర మంత్రిగా పని చేశారు. ఆయన తనయుడు కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మూడు సార్లు కర్నూలు ఎంపీగా పని చేశారు. 2012 సంవత్సరంలో కేంద్రంలో రైల్వే శాఖ సహాయ మంత్రిగా కూడా ఆయన పని చేశారు. అయితే ఊహించని రాజకీయ పరిణామాలతో కోట్ల కుటుం బం డోన్ నియోజకవర్గ రాజకీయాల్లోకి అడుగు పెట్టాల్సి వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు తీసుకున్న అనూహ్య నిర్ణయాల నడుమ డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పేరును ప్రకటించారు.



డోన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల నివేదిత

●కోట్ల వేగం పెంచడంతో డోన్ నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో అలజడి కలుగుతోంది. . వైసీపీలో అసంతృప్తిగా ఉన్న పలువురు నేతలు ఇప్పటికే టీడీపీ గూటికి చేరారు. సీనియర్ వైసీపీ నాయకులు, సీనియర్ న్యాయవాది భాస్కర్ నాయుడు, వెంకటనాయునిపల్లి సర్పంచ్ సీలం చంద్రశేఖర్, ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్‌బాషా, ప్యాపిలి మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకటరెడ్డి, ఎర్రగుంట్లపల్లి రమేష్‌రెడ్డితో పాటు వందల మంది కార్యకర్తలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ మద్దతుదారుడుగా ఉన్న మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు కోట్లకు తన మద్దతును ప్రకటించారు. వైసీపీలో ఉన్న పలువురు అసంతృప్తి నాయకులు కోట్ల కుటుంబంతో మంతనాలు జరుపుతున్నారు. పలువురు టీడీపీలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తాయోనని నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో కలవరం పుట్టిస్తోంది.



ప్రచారం నిర్వహిస్తున్న కోట్ల రాఘవేంద్రరెడ్డి

విస్తృతంగా పర్యటనలు

కేంద్ర మాజీ మంత్రి, డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి దూకుడు పెంచారు. తన పేరును ప్రకటించినప్పటి నుంచి నియోజకవర్గంలోని డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇంటింటికి వెళ్లి కోట్ల ప్రజలను కలుసుకుని సమస్యలు అడిగి తెలుసుకుంటున్నారు. టీడీపీ మేనిఫెస్టో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ ప్రజల్లో తనదైన ముద్రను వేసుకుంటున్నారు. డోన్ నియోజకవర్గంలో టీడీపీని మరింత బలపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదుపుతుండటంతో నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ సమీకరణలు మారిపోయాయి.

● వైసీపీలో అలజడి

కోట్ల వేగం పెంచడంతో డోన్ నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో రేపుతోంది. వైసీపీలో అసంతృప్తిగా ఉన్న పలువురు నేతలు ఇప్పటికే టీడీపీ గూటికి చేరారు. సీనియర్ వైసీపీ నాయకులు, సీనియర్ న్యాయవాది భాస్కర్ నాయుడు, వెంకటనాయునిపల్లి సర్పంచ్ సీలం చంద్రశేఖర్, ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్‌బాషా, ప్యాపిలి మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకటరెడ్డి, ఎర్రగుంట్లపల్లి రమేష్‌రెడ్డితో పాటు వందల మంది కార్యకర్తలు కోట్ల సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ మద్దతుదారుడుగా ఉన్న మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు కోట్లకు తన మద్దతును ప్రకటించారు. వైసీపీలో ఉన్న పలువురు అసంతృప్తి నాయకులు కోట్ల కుటుంబంతో మంతనాలు జరుపుతున్నారు. పలువురు టీడీపీలోకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీస్తాయోనని నియోజకవర్గ వైసీపీ శ్రేణుల్లో కలవరం పుట్టిస్తోంది.



పొంచి ఉన్న ప్రమాదం

● ఒరిగిన విద్యుత్ స్తంభాలు ● ఆందోళనలో రైతులు



భీమవరం గ్రామ శివారులో ఒరిగిన విద్యుత్ స్తంభం

నంద్యాల రూరల్, మార్చి 21: మండలంలోని చాబోలు, భీమవరం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. భీమమవరం గ్రామ శివారుతో పాటు చాబోలు సాంబవరం గ్రామ రహదారిలో ఒరిగి ప్రమాదకరంగా ఉన్నాయి. అయితే ఎప్పుడు కిందికి పడతాయో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



చాబోలు సాంబవరం గ్రామ రోడ్డులో..

'నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి'

బండిఆత్మకూరు, మార్చి 21: ఎన్నికల సంఘం నియమావళిని పకబ్బందీగా అమలు చేయాలని ఎపీడీవో సగిలి విజయరావు ఆదేశించారు. గురువారం బండి ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనకుండా చూడాలన్నారు. అలాంటి వాటిపై నిగా వేసి ఉంచాలని, వాటిని ఆధారాలతో చిత్రీకరించి ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ప్రతి రోజు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. అనంతరం బండిఆత్మకూరు సచివాలయం 1, ఎర్రగుంట్ల గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరణపై సమావేశాలు నిర్వహించి ఎంపీడీవో సూచనలు ఇచ్చారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసులు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ



వేంపెంట గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

పాములపాడు, మార్చి 21: మండలంలోని వేంపెంట గ్రామంలోని ప్రభుత్వ కార్యాలయాలను ఎంపీడీవో సరస్వతి గురవారం తనిఖీ చేశారు. ఎంసీసీలో భాగంగా గ్రామంలోని సచివాలయం, అంగన్‌వాడీ, ప్రథమ చికిత్స కేంద్రాలను, అంతర్గత వీధులను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రం పరిశీలన



రేగడ గూడూరులో ఆర్బీకేలో వ్యవసాయశాఖ అధికారులు

వెలుగోడు మార్చి 21: మండలంలోని రేగడ గూడూరు రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు, మార్క్‌ఫెడ్ జీఎం ఆదినారయణ, మార్కెట్ డీఎం నాగరాజు, వెలుగోడు వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్ పరిశీలించారు. వారు మాట్లాడుతూ రబీలో సాగు చేసిన జొన్న పంటను ప్రభుత్వం క్వింటా కనీస మద్దతు ధర రూ.3180కు కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆర్బీకేలో రిజిస్టర్‌లో నమోదు చేసిన రైతుల ధాన్యాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే నంద్యాల జిల్లాలో 1,218 మంది రైతులు నమోదు చేసుకోగా 1573 మెట్రిక్ టన్నుల జొన్న కొనుగోలు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'పరిహారం చెల్లించి పనులు చేపట్టాలి'



పైపులైన్ పనులను అడ్డుకుంటున్న అశోకరత్నం, వ్యాపారులు

నందికొట్కూరు, మార్చి 21: స్థలాలను కోల్పోయిన దుకాణదారులకు నష్టపరిహారం చెల్లించకుండా పైప్‌లైన్ ఎలా వేస్తారని, పరిహారం చెల్లించి పనులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి అశోకరత్నం డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో కేజీ రోడ్డులో జరుగుతున్న పైపులైన్ పనులను షాపు యజమానులతో కలిసి అశోకరత్నం అడ్డుకున్నారు. అనంతరం పనులను నిలిపివేయించాలంటూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణలో భాగంగా షాపు దుకాణాలను తొలగించారని, అయితే పరిహారం ఇవ్వలేదని చెప్పారు. ఇప్పుడు కూడా నష్టపరిహారం చెల్లించకుండా తాగునీటి పైపు లైన్‌ను ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. పరిహారం చెల్లించి పనులు చేసుకోవాలని, లేని పక్షంలో షాపు దుకాణదారుల నుంచి తీవ్ర వ్యతిరేకత తప్పదని ఆయన హెచ్చరించారు.

సీడ్స్ కంపెనీపై దాడులు



రసాయనాలు వదిలిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నంద్యాల రూరల్, మార్చి 21: నంద్యాల పట్టణ శివారుల్లోని అయ్యలూరు మెట్ట సమీపంలో ఉన్న హరినాథ్ సీడ్స్ కంపెనీపై గురువారం కాలుష్య నియంత్రణ అధికారులు దాడులు నిర్వహించారు. హరినాథ్ సీడ్ కంపెనీ ప్రమాదకర రసాయనాలను తమ పొలాలు, స్థలాల్లో వదులుతున్నారని సంబంధిత యజమానులు, రైతుల ఫిర్యాదు మేరకు అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ప్రమాదకర రసాయనలను వదిలిన ప్రాంతాలను అధికారులు పరిశీలించి శాంపిళ్లను సేకరించారు. ఫ్యాక్టరీ యజమాని నాగేశ్వర రెడ్డి మీద చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ ఇచ్చారు. గతంలో కూడా హరినాథ్ సీడ్స్ పై ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు. దాడుల్లో పొల్యూషన్ బోర్డు అధికారులు ముని ప్రసాద్, గణేష్ ఉన్నారు.

'సేవా కార్యక్రమాలు విస్తృతం'

నంద్యాల (నూనెపల్లె), మార్చి 21: ఎల్షాద్దాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ప్రభు ఇమ్మానుయేల్, డైరెక్టర్ ఎల్ ఇమ్మానుయేల్ తెలిపారు. గురువారం ఎల్షాద్దాయి ఫౌండేషన్ సహకారంతో 19వ వార్డు పొన్నాపురం కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎంఆర్ హాస్పటల్‌కు చెందిన వైద్యులు శివప్రసాద్, డాక్టర్ మంజుల, డాక్టర్ సాజిదా, వైద్య సిబ్బంది హాజరయ్యారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

హుండీ ఆదాయం రూ.3.54 లక్షలు



కొలనుభారతి క్షేత్రంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, విద్యార్థినులు

కొత్తపల్లి, మార్చి 21: కొత్తపల్లి మండలంలోని కొలనుభారతి హుండీ లెక్కింపులో రూ.3,54,861 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సీతామోహన్ తెలిపారు. గురువారం క్షేత్ర ప్రాంగణంలో భక్తులు అమ్మవారి హుండీలో వేసిన కానుకలను కర్నూలు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పాండురంగారెడ్డి పర్యవేక్షణలో ఈవో సీతామోహన్, ధర్మకర్తల పాలకమండలి చైర్మన్ వెంకటనాయుడు ఆధ్వర్యంలో లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈవో మాట్లాడుతూ 2023 సెప్టెంబరు 21 నుంచి నుంచి 2024 మార్చి 21 వరకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో వచ్చిన్న ఆదాయాన్ని కొత్తపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో అమ్మవారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు ఈవో చెప్పారు. ఈ హుండీ లెక్కింపులో పాలక మండలి సభ్యులు, ప్రజలు, కొత్తపల్లి రాజరాజేశ్వరి పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండలంలోని శివనందీశ్వర ఆలయ శాశ్వత హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవాలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్ ఆధ్వర్యంలో 26 నెలలకు సంబంధించిన హుండీలో భక్తుల కానుకలను లెక్కించగా రూ.87,613లు లభించినట్లు ఈవో నాగప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

'శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు'



వడ్లరామాపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ

ఆత్మకూరు రూరల్, మార్చి 21: రాబోయే ఎన్నికల్లో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆత్మకూరు టౌన్ సీఐ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గురువారం కురుకుంద, కొట్టాల చెరువు, వడ్లరామాపురం గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించి గ్రామ సభను ఏర్పాటు చేసి గ్రామస్థులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి గురించి వివరించారు. సీఐ మాట్లాడుతూ.. ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకే ఈ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. ప్రజలందరూ ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వ్యక్తులను కించ పరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు చేయవద్దని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ నారాయణ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడికి జైలు శిక్ష

పగిడ్యాల, మార్చి 21: ఇద్దరు చిన్నారులను కొట్టినందుకు వైసీపీ నాయకుడు నగినెల వెంకటరమణకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ నందికొట్కూరు అసిస్టెంట్ న్యాయాధికారి తీర్పునిచ్చినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. 2020 సంవత్సరంలో పగిడ్యాల మండలం పడమర ప్రాతకోట గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంక్‌లో చిన్నారులు ఉపేంద్ర, సంతోష్, హరికృష్ణ మూత్రం పోశారంటూ వెంకటరమణ కొట్టారు. చిన్నారుల తల్లిదండ్రులు ముచ్చుమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారించి గురువారం వెంకటరమణకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ నందికొట్కూరు అసిస్టెంట్ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు



పూజలందుకున్న దత్తాత్రేయ స్వామి

శ్రీశైలం, మార్చి 21: శ్రీశైలం మహా క్షేత్రంలో గురువారం మల్లికార్జున స్వామి ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద ఉన్న దత్తాత్రేయ స్వామికి లోక కల్యాణం కోసం విశేష పూజలను దేవస్థానం నిర్వహించింది. పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజలు చేసి, అనంతరం దత్తాత్రేయస్వామికి పంచామృతాభి షేకం, విశేష పూజలు జరిపారు.

అలరించిన తోలుబొమ్మలాట

నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా దేవస్థానం గురువారం సాయంత్రం తోటబాలకృష్ణ, కాకినాడ బృందంచే రామాయణం సుందరాకాండపై తోలుబొమ్మలాట ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కథకులుగా తోట బాలకృష్ణ వ్యవహరించగా, గాత్రం తోట నాగమణి, అనపర్తి పాపరావు, లక్ష్మీ, తోట సత్యం, పోతురాజు, విజయ్ దుర్గాశాంతి, చంద్రకళ ఆలపించారు.



శ్రీశైలంలో తోలు బొమ్మలాటను ప్రదర్శిస్తున్న దృశ్యం

కమనీయం.. లక్ష్మీనృసింహస్వామి కల్యాణం



లక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నంద్యాల (కల్చరల్), మార్చి 21: నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లో వెలసిన మహాజ్వాల సుదర్శన లక్ష్మీనృసింహ ధర్మపీఠంలో గురువారం లక్ష్మీనృసింహస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు నరసింహయ్య, భక్తులు సుబ్బారావు, బీజేపీ నాయకుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వెండి వస్తువుల బహూకరణ



వెండి వస్తువులను అందజేస్తున్న భక్తులు

శ్రీశైలం, మార్చి 21: శ్రీశైలం దేవస్థానానికి కృష్ణాజిల్లా అవనిగడ్డకు చెందిన వల్లభనేని రామరావు, కృష్ణకుమారి దంపతులు గురువారం వెండి పూజా సామగ్రిని సమర్పించారు. స్వామి, అమ్మవార్ల కైంకర్యాలలో వీటిని వినియోగించేందుకు అందజేసినట్లు భక్తులు తెలిపారు. వీటిలో 740 గ్రాముల వెండి బిందె, 390 గ్రాముల రెండు వెండి ప్రమిదలు, 150 గ్రాముల వెండి ప్లేటు, రెండు 160 గ్రాముల వెండి అక్షిత గిన్నెలు, 35 గ్రాముల అగరుబత్తి స్టాండ్ అందజేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో భక్తులు వీటిని సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములుకు అందజేశారు. వీరికి దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

రేపు 16 రోజుల వేడుకలు

మహానంది, మార్చి 21: మహానంది క్షేత్రంలో శనివారం 16 రోజుల వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. మహాశివరాత్రి పర్వదిన ఉత్సవాలు పూర్తయి 16 రోజులు పురష్కరించుకొని రథశాల వద్ద వేదపండితులు, అర్చకులు ప్రత్యేక పూజలు, నైవేద్యాలను భక్తి శ్రద్ధలతో రథానికి సమర్పిస్తారు. అంతకుముందు అంకురారోపణ పూజలతో పాటు బ్రహ్మోత్సవాల్లో మెలకింప చేసిన వివిధ ధాన్యాల మెలకలను రుద్రగుండం కోనేరులో కలపనున్నట్లు తెలిపారు. ప్రధాన ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని చెప్పారు. రథాన్ని భక్తుల శివనామస్మరణతో రథశాలలోకి లాగడంతో మహానందిలో 16 రోజుల ఉత్సవం ముగుస్తుందని ఈవో వివరించారు.

భక్తుడికి పర్సు అప్పగింత

మహానంది, మార్చి 21: మహానంది క్షేత్రంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన నరసింహ అనే భక్తుడు ఆలయం పరిసరాల్లో తన పర్సును పోగొట్టుకున్నారు. ఈ విషయాన్ని ఆలయంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బాలుడు దృష్టికి తీసుకొని రావడంతో ఆయన మిగతా భక్తులకు విషయం తెలపారు. రుద్రగుండం కోనేరు వద్ద ఒక భక్తునికి దొరికిన పర్సును హోంగార్డుకు తెచ్చి ఇచ్చారు. దీంతో సమాచార కేంద్రంలోని మైకు ద్వారా పర్సు విషయం తెలపడంతో బాధిత భక్తుడు అక్కడికి చేరుకొన్నాడు. ఆలయ ఉద్యోగి రామశివ చేతుల మీదుగా పొగొట్టుకొన్న భక్తునికి పర్సును అప్పగించారు.

'పౌష్టికాహారం తీసుకోవాలి'



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ఆయుష్ వైద్యురాలు

పాణ్యం, మార్చి 21: మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలని ఆయుష్ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. పాణ్యం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆయుష్ ఆధ్వర్యంలో గర్భిణులకు పోషక్ పక్వాడ్ పురస్కరించుకొని పోషకాహారం ఆవశ్యకతను వివరించారు. విటమిన్స్, మినరల్స్ కలిగిన ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వ్యాయామం తప్పనిసరిగా ఉండాలన్నారు. మానసిక ఒత్తిడి తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది ప్రసాద్ పాల్గొన్నారు.

'ఆడపిల్లలను చదివించాలి'

కొత్తపల్లి, మార్చి 21: ఆగ, మగ అనే వ్యత్యాసం లేకుండా మగపిల్లలకు దీటుగా ఆడపిల్లలను చదివించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. మండలంలోని దుద్యాల జిల్లా పరిషత్ హై స్కూల్‌లో గురువారంభేటీ భచావో.. భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగేశ్వరమ్మ మాట్లాడుతూ లింగ వివక్షత లేకుండా చదివించడం వల్ల ఆడపిల్లలు కూడా ఈరోజుల్లో ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని గుర్తు చేశారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, ఏఎన్ఎంలు త్రివేణి, విమల, జ్యోతి, మహిళా పోలీసు శ్రీలక్ష్మి, సీహెచ్‌వో విజయశాంతి, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన నాయకులతో ఫరూక్

గోస్పాడు, మార్చి 21: గోస్పాడు మండల మాజీ ఉపాధ్యక్షుడు, జూలేపల్లె గ్రామ మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు జి.పార్థసారథిరెడ్డి, అదే గ్రామానికి చెందిన పలువురు నాయకులు వైసీపీకి ఝలక్ ఇచ్చారు. గురువారం నంద్యాల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ సమక్షంలో జూలేపల్లెకు చెందిన వైసీపీ నాయకులు మూకుమ్మడిగా టీడీపీలో చేరారు. కాగా గత 20 సంవత్సరాలుగా శిల్పా వర్గంలో ఉంటూ కీలకమైన నాయకుడిగా ఉన్న పార్థసారథిరెడ్డి వర్గం టీడీపీలో చేరడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా పని చేస్తామని టీడీపీలో చేరిన నాయకులు వెల్లడించారు. ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలను మభ్యపెట్టేందుకు శిల్పా కుటుంబం ప్రయత్నిస్తూ, డబ్బుతో ఓట్లను కొనుక్కునేందుకు గ్రామ గ్రామానా తాయిలాల ఎర వేస్తున్నప్పటికీ ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఒక్క చాన్స్ పేరుతో రాష్ట్రాన్ని బ్రష్టు పట్టించిన జగన్ మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాతిరెడ్డి తులసిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, జూలేపల్లె నాయకులు ఓబుల్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: మాండ్ర



నెహ్రూనగర్‌లో పర్యటిస్తున్న శివానందరెడ్డి, జయసూర్య

పగిడ్యాల, మార్చి 21: టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్యతో కలిసి గురువారం రాత్రి నెహ్రూనగర్ గ్రామంలో పర్యటించారు. మాండ్ర మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, టీడీపీ నాయకులు లోకానందరెడ్డి, రామిరెడ్డి, హేమసుందరరాజు, చాకలి రామస్వామి తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు: ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ వర్గానికి చెందిన వారు వరుసగా టీడీపీలో చేరుతున్నారు. గురువారం నందికొట్కూరులో పట్టణ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, ముర్తుజావలి, షకీల్ అహ్మద్, జమీల్ ఆధ్వర్యంలో మారుతీ నగర్‌కు చెందిన వైసీపీ వార్డు ఇన్‌చార్జి తాటిపాటి అయ్యన్న, ఏసేపు, రవి, స్వాములు, సతీష్, సుజాత, కనికరమ్మ, ఏసమ్మ, సులోచనమ్మ, రేష్మా ఇతర వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. అయ్యన్నతో పాటు ఇతర మహిళా నాయకులకు నంద్యాల పార్లమెంటరీ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం: బుడ్డా



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకులతో రాజశేఖరరెడ్డి

వెలుగోడు, మార్చి 21: టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం వెలుగోడులో తెలుగుపేటకు చెందిన 80 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారిలో తెలుగు పెద్ద శేషన్న, తెలుగు తిమ్మయ్య, మాజీ ఎంపీటీసీ రమణ, మాజీ ఎంపీటీసీ భద్రుడు తదితరులు చేరారు. అలాగే వెలుగోడు పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు టీడీపీలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల, బీసీల అభ్యున్నతికి పాటు పడిన పార్టీ తెలుగుదేశం అన్ని, అందుకే ఈ పార్టీలో చేరినట్లు చేరినట్లు తెలిపారు.

పత్తికొండ ఎమ్మెల్యే కోడ్ ఉల్లంఘన!

● 22 మందికి సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

● ఎమ్మెల్యే శ్రీదేవికి ఈసీ నోటీసులు



తన నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కును అందిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ, మార్చి 21: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికార వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు కోడ్‌ను ఏమాత్రం లెక్కచేయడం లేదు. ఎక్కడ చూసినా యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ఏకంగా 22 మంది బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను బుధవారం పంపిణీ చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆమె పంపిణీ చేసిన ఫొటోలు వైసీపీ సోషల్ మీడియా గ్రూపులతో పాటు స్థానికంగా వాట్సాప్ గ్రూపుల్లో హల్ చల్ చేశాయి. బహిరంగంగా చెక్కులను పంపిణీ చేస్తే కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిసి కూడా ఎమ్మెల్యే గోప్యంగా తన నివాసంలో బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఎమ్మెల్యే శ్రీదేవికి ఎలక్షన్ కమిషన్ నోటీసులను జారీ చేసింది. ఈ మేరకు గురువారం పత్తికొండ రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేస్తారని, నిబంధనల ఉల్లంఘనలపై 24 గంటలలోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. ఎన్నికల అధికారి రామలక్ష్మి జారీ చేసిన షోకాజ్ నోటీసును రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే శ్రీదేవికి నేరుగా అందజేశారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వైసీపీ శాశ్వతంగా ఇంటికే..

మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ



చనుగొండ్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కోట్ల సుజాతమ్మ

డోన్, మార్చి 21: వైసీపీ అరాచక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, ఓటు అనే ఆయుధంతో శాశ్వతంగా ఆ పార్టీని ఇంటికి పంపిస్తారని డోన్ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. గురువారం డోన్‌లో ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ నియంతృత్వ పోకడలతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. మద్యాన్ని నిషేధిస్తానని జగన్ మాట ఇచ్చి మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. విచ్చలవిడిగా కల్తీ మద్యం అమ్ముతూ వైసీపీ నాయకులు అక్రమంగా డబ్బు సంపాదించుకున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాల్లోనూ కోతలు కోసి పేదలకు అన్యాయం చేసిందన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. మండలంలోని చనుగొండ్ల గ్రామంలో టీడీపీ కార్యకర్త మునెప్ప మృతికి కోట్ల సుజాతమ్మ సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కోట్ల సుజాతమ్మ వెంట టీడీపీ నాయకులు ఓంప్రకాష్, శ్రీరాములు, జయరాముడు, టైలర్ ఖాజా ఉన్నారు.

దాడి కేసులో ఐదేళ్ల జైలు శిక్ష

రుద్రవరం, మార్చి 21: మండలంలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన దండు గోపాలకృష్ణకు ఆళ్లగడ్డ అసిస్టెంటు సెషన్స్ న్యాయాధికారి శైలజ ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2017లో వర్షం కోసం గోపాలకృష్ణ కప్పలతో ఊరేగింపు నిర్వహించారు. ఆయన చందా అడగడంతో అదే గ్రామానికి చెందిన చిన్న వెంకటేశ్వర్లు రూ.50 ఇచ్చారు. మరోసారి అడగడంతో డబ్బులు లేవని చిన్నవెంకటేశ్వర్లు తమ్ముడు రమణ చెప్పారు. చందా అడిగితే ఇవ్వవా? అంటూ గోపాలకృష్ణ రమణపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. రమణ సోదరుడు చిన్న వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేయడంతో అప్పట్లోనే పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని ఆళ్లగడ్డ సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు.

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

డోన్, మార్చి 21: టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని డోన్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు అన్నారు. గురువారం పట్టణంలోని కొండపేటలో టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీఈ కేశన్నగౌడు మాట్లాడుతూ వైసీపీ పాలనలో 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి పైసా నిధులివ్వకుండా నిర్వీర్యం చేశారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో బీసీల అభివృద్ధికి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున బీసీ సబ్‌ప్లాన్ నిధులు కేటాయించారన్నారు. బీసీ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీసీ వర్గాలకు 50 ఏళ్లకే నెలకు రూ.4వేలు పింఛన్ ఇచ్చేలా చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచులు శ్రీరాములు, రంగన్న, టీఈ రాఘవేంద్ర గౌడు, భూమా నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

'నీటిని పొదుపుగా వాడుకోవాలి'

రుద్రవరం, మార్చి 21: గ్రామాల్లో నీటిని పొదుపుగా వాడుకోవాలని అబ్దుల్ గఫార్ సూచించారు. గురువారం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఆటో యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో నీటి కష్టాలు ఉండొచ్చని అన్నారు. నీటిని వృథా చేయకుండా పొదుపు చేస్తే భవిష్యత్తులో నీటి కష్టాలు ఉండవని సూచించారు.

మహిళల కోసం మహాశక్తి పథకం



టీడీపీ మేనిఫెస్టో పథకాలను వివరిస్తున్న కోట్ల చిత్రమ్మ

బేతంచెర్ల, మార్చి 21: తెలుగుదేశం పార్టీ ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోలోని మహాశక్తి పథకంతో మహిళలు మహారాణులవుతారని డోన్ టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి కూతురు కోట్ల చిత్రమ్మ అన్నారు. గురువారం నగర పంచాయతీ పరిధిలోని 7, 15, 16 వార్డుల కౌన్సిల్స్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని స్థానిక వార్డు టీడీపీ నాయకులు కాకర్ల తిరుమలేష్ చౌదరి, మేకల నాగరాజు, రూబెన్, ఫయాజ్ ఆధ్వర్యంలో పట్టణ టీడీపీ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కోట్ల చిత్రమ్మ మాట్లాడుతూ సైకో సీఎం జగన్ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని, జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో వైసీపీ రౌడీమూకలు మహిళలపై నిత్యం దాడులు చేస్తున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలలో మహాశక్తి పథకం ద్వారా 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 (ఏడాదికి రూ.18వేలు 5 సంవత్సరాలకు రూ.90వేలు) ఇస్తారని అన్నారు. టీడీపీ, జనసేన నాయకులు చల్ల మద్దిలేటి స్వామి, నాగరాజు, శ్రీకంటి మధు పాల్గొన్నారు.

వైసీపీ పతనం ఖాయం: అఖిలప్రియ



టీడీపీలో చేరిన వారితో భూమా అఖిలప్రియ

రుద్రవరం, మార్చి 21: రాష్టంలో వైసీపీ పతనం ఖాయమని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని మాచినేనిపల్లె గ్రామంలో గురువారం పర్యటించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఐదేళ్లలో ప్రజలకు చేసింది శూన్యమని, అవినీతి చేయడంలో వైసీపీ ఎమ్మెల్యేలు ముందున్నారని ఆరోపించారు. 2024 రాబోవు ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాచినేనిపల్లె గ్రామంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి మాజీమంత్రి భూమా అఖిలప్రియ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, భార్గవరామ్ నాయుడు, గంగుల పృథ్వీరాజ్‌కుమార్‌రెడ్డి, రంగనాయకులు , ఎర్రం ప్రతాప్‌రెడ్డి, రామ్‌నాథరెడ్డి, బొప్పాపక్కీరయ్యగౌడ్, యడవలి శ్రీనివాసులు, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: రాష్ట్రంలో టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని ఆళ్లగడ్డ టీడీపీ అభ్యర్థి భూమా అఖిలప్రియ అన్నారు. గురువారం సాయంత్రం చాగలమర్రి 2వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రవేశ పెట్టె సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. అన్వర్‌బాషా, నరసింహారెడ్డి, సల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, ఉసేన్‌వలి, షరీఫ్, మౌళాలి, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి షాక్

» టీడీపీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు
» కిక్కిరిసిపోతున్న బనగానపల్లె పార్టీ కార్యాలయం



వైసీపీ నాయకులకు కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 21: బనగానపల్లె నియోజకవర్గంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి భారీగా వలసలు హోరెత్తుతున్నాయి. బనగానపల్లె టీడీపీ అభ్యర్థి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో వైపీపీకి చెందిన నాయకులు పార్టీ కార్యాలయానికి జాతరలా వస్తున్నారు. గురువారం నియోజకవర్గంలోని సంజామల మండలం ఆర్. లింగందిన్నె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఉపసర్పంచ్ లత భర్త అన్నెం పరమేశ్వరరెడ్డి, అన్నెం వెంకటసుబ్బారెడ్డి, ఆధ్వర్యంలో వార్డు సభ్యులు యాకోబ్, రాజశేఖర్, లక్ష్మి, శూలం గురువయ్య, మూరబోయిన వెంకటేశ్వర్లు, శేఖర్, భీముడు, జెమినిబాషా, అహ్మద్‌హుసేన్, షరీప్, మేకల ఏసు, సత్యం తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నందిపాడు చెందిన 45 కుటుంబాలు టీడీపీలో చేరిక: టీడీపీ సీనియర్ నాయకుడు ఐవీ ఫక్కీర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం కొలిమిగుండ్ల మండలం నందిపాడు చెందిన 45 కుటుంబాలు వైసీపీని వీడి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపికి చెందిన నాగేశ్వరరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, గొల్లబాలయ్య, తిరుమలరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసిహారెడ్డి, గురప్ప, చాకలిరాముడు, ఓబన్న, గొల్లశ్రీరామ్, బలిజ రమణయ్య తదితరులు టీడీపీలో చేరారు.

ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



డోన్: ముస్లిం నాయకులతో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, మార్చి 21: ముస్లిం మైనార్టీల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉందని డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని సాయి ఫంక్షన్ హాలులో ముస్లిం మైనార్టీల నాయకులతో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం దుల్హాన్ పథకాన్ని అమలు చేశారని అన్నారు. ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా బ్యాంకుల నుంచి విరివిగా రుణాలు ఇప్పించి యువతకు ఆర్థికంగా చేయూత ఇచ్చినట్లు తెలిపారు. వైసీపీ పాలనలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేకంగా ఎలాంటి పథకాలు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోట్రికే ఫణిరాజ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్ష్మీరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, మాజీ సర్పంచ్ కేశవయ్యగౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, ఓంప్రకాష్, ముస్లిం మైనార్టీ నాయకులు అన్వర్ బాషా, అల్లాబకాష్, ఎస్ఎండీ రఫీ, ఆలంకొండ రఫీ పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం పాడుదాం: కోట్ల

ప్యాపిలి: వైసీపీ పాలనకు చరమగీతం పాడుదామని మాజీ కేంద్ర మంత్రి, టీడీపీ డోన్ నియోజకవర్గం అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని బస్టాండ్, మెయిన్ బజార్, మధ్యగేరి, కిందిగేరి ప్రాంతాల్లో కోట్ల ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పులతో పబ్బం గడుపుతున్న జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని తాకట్టు పెడు తుందని కోట్ల విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబు సేవలు అవసరమన్నారు. అనంతరం ఇంటింటా తిరిగి టీడీపీ మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, నాయకులు టి శ్రీనివాసులు, అలేబాదు పరమేష్, ఆర్ఈ నాగరాజు, రామ్మోహన్‌యాదవ్, ఖాజాపీర్, టి వెంకటేశు, రజనీకాంత్‌రెడ్డి, చల్లా అనుదీప్, మధుకుమార్, వెంకటరమణాచారి, నాగేంద్ర, క్రిష్ణమోహన్, గండికోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పైపుల అక్రమ తరలింపు విచారకరం: వాటర్ గ్రిడ్ పథకం కోసం పైపులను అమరావతి నుంచి డోన్‌కు అక్రమంగా తరలించడం విచారకరమని మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి విమర్శించారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల, డోన్, ఉద్దానం నియోజకవర్గాల్లో రూ. 1,477 కోట్ల కేంద్ర నిధులతో రాష్ట్ర ప్రభుత్వం వాటర్ గ్రిడ్ పథకాన్ని చేపట్టింది. అయితే డోన్‌లో ఈ పథకానికి పైపుల కొరత ఉండటంతో కాంట్రాక్టర్ అమరావతిలో తాగునీటి పథకానికి ఉంచిన పైపులను అధికారుల అనుమతులు లేకుండా డోన్‌కు తరలించారని కోట్ల ఆరోపించారు. పైపుల అక్రమ తరలింపు వెనుకాల ఆర్థిక మంత్రి హస్తముదని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్, మాజీ ఎంపీపీ శ్రీనావాసులు, న్యాయవాది భాస్కర్ నాయుడు పాల్గొన్నారు.

భూ సారాన్ని కాపాడుకోవాలి



ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

బనగానపల్లె, మార్చి 21: ప్రకృతి వ్యవసాయంతో భూ సారాన్ని కాపాడుకోవాలని యాగంటిపల్లె కృషివిజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ధనలక్ష్మి కోరారు. గురువారం కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణా తరగ తులు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రకృతి వ్యవసాయంపై శిక్షణపొందిన రైతులకు నరేంద్రారెడ్డి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కోఆర్డినేటర్ ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. ప్రతి రైతు కనీసం ఎకరా పొలంలోనైనా ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రమణయ్య, బలరాజులు ప్రకృతి వ్యవసాయం తయారీ విధానాల గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో సూక్ష్మ జీవుల ఆవశ్యకతను, వాటిని వృద్ధికి చేయాల్సిన పద్ధతులను వివరించారు. కొత్త రకాలపై పంటలను గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు కృష్ణమూర్తి, రవిగౌడ్, లక్ష్మిప్రియ, రైతులు పాల్గొన్నారు.

రాయలసీమకు వైసీపీ చేసిందేమీ లేదు

డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ ధ్వజం



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

డోన్(రూరల్), మార్చి 21: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాయలసీమ ప్రాంత అభివృద్ధికి చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకర్త గార్లపాటి మద్దిలేటితో కలిసి లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడారు. కర్నూలు జిల్లాను న్యాయ రాజధాని పేరుతో వైసీపీ ప్రభుత్వం వంచించిందని ఆరోపించారు. రాయలసీమ ప్రాంతంలో ఒక్కటి తాగునీటి ప్రాజెక్టును పట్టించుకోలేని ఈ వైసీపీ ప్రభుత్వాన్ని రాయలసీమ ప్రాంత వాసులు ఇంటికి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌తోనే దేశం అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నియోజకవర్గ సమన్వయకార్యకర్త గార్లపాటి మద్దిలేటితో పాటు మండలాల నాయకులు జనార్దన్ నాయక్, సుబ్బయ్య, వడ్డెరాజశేఖర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



గొట్లూరులో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో

చాగలమర్రి, మార్చి 21: మండలంలోని గొట్లూరు ప్రాథమిక పాఠశాలను ఎంఈవో న్యామతుల్ల గురువారం తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యమైన కోడిగుడ్లు, భోజనం అందించాలని, మెనూ తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం తిరుమలదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బనగానపల్లె ఈవో ఖలీల్‌బాషా బదిలీ

బనగానపల్లె, మార్చి 21: బనగానపల్లె గ్రామ పంచాయతీ ఈవో ఖలీల్ బాషాను బదిలీ చేశారు. అవుకు మండలం మెట్టుపల్లె గ్రామ పంచాయతీ గ్రామ సెక్రటరీగా పనిచేస్తున్న హరిప్రసాద్‌ను బనగానపల్లె ఈవోగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో ఖలీల్‌బాషాను అప్పలాపురం గ్రామ కార్యదర్శిగా బదిలీ చేశారు. అవుకు మండలం మెట్టుపల్లెలో గ్రామ సెక్రటరీగా పనిచేస్తున్న హరిప్రసాద్‌ను బనగానపల్లె గ్రామ పంచాయతీ ఈవోగా నియమించారు. ఈమేరకు శుక్రవారం హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి, మార్చి 21: చాగలమర్రిలోని గుంతపాలెం వీధిలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ గురువారం తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల గ్రేడింగ్‌ను చూశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడుపనులను పరిశీలించి వేగవంతం చేయాలని సూచించారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా విద్యార్థులకు అంద జేసిన నోట్ పుస్తకాలను డిక్షనరీలలో ప్రభుత్వ పథకాలు ఉన్నాయని, వాటిని కనబడకుండా అట్టలు వేయించుకునేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం జైలాబ్దిన్, సీఆర్పీ అమీర్‌ఖాన్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

నంద్యాల, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని కుమ్మరి కొట్టాలలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన నలుగు కుటుంబాలకు జిల్లా పాల డైరీ చైర్మన్ ఎస్వీ జగన్‌మోహన్‌రెడ్డి తన స్వగృహంలో గురువారం ఆర్థికసాయం అందించారు. బాధితులైన షేక్‌బాషా, వెంకటలక్ష్మమ్మ, ఆదిలక్ష్మమ్మ, మహేష్‌లకు రూ. 20వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కొండుపల్లె శేఖర్‌రెడ్డి, భాస్కరరెడ్డి, ఎస్వీప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి పన్ను వసూలు చేయండి'

రుద్రవరం, మార్చి 21: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటి పన్నులు వసూలు చేయాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ ఆదేశించారు. గురువారం గ్రామ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ మాట్లాడుతూ కొత్తగా గ్రామాల్లో బోర్లు వేయకూడదన్నారు.

నాటు సారా స్వాధీనం.. బైక్ సీజ్

బనగానపల్లె, మార్చి 21: కొలిమిగుండ్ల మండలం తుమ్మలపెంట గ్రామ సమీపంలో కొండమనాయునిపల్లె గ్రామానికి చెందిన కోటకొండ సాయినాథ్ అను వ్యక్తి 80 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని అతన్ని అరెస్టు చేసి మోటారు బైక్‌ను సీజ్ చేసినట్లు గురువారం సెబ్ సీఐ జోగేంద్ర గురువారం తెలిపారు. అలాగే కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లె గ్రామంలో పెద్దపుల్ల య్య అనే వ్యక్తి ఇంటి వద్ద 60 లీటర్ల నాటుసారా స్వాదీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

కొలిమిగుండ్ల, మార్చి 21: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నియోజకవర్గ కోకన్వీనర్ వీఆర్ లక్ష్మీరెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లె గ్రామంలో బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి వెంకట మల్లారెడి, సర్పంచ్ శివశంకర్, ఉప సర్పంచ్ రామలక్ష్మన్న, పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి: సీఐ



బేతంచెర్లలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

బేతంచెర్ల, మార్చి 21: రానున్న ఎన్నికల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సీఐ ప్రియతమ్ రెడ్డి ప్రజలకు సూచించారు. గురువారం సీఐ ప్రియతమ్ రెడ్డి, ఎస్ఐ శివశంకర్ నాయక్‌ల ఆధ్వర్యంలో బేతంచెర్ల పోలీస్ స్టేషన్ నుంచి పాతబస్టాండు కొత్తబస్టాండు మీదుగా గురువయ్య పెట్రోల్‌బంక్ వరకు స్పెషల్ పార్టీ కేంద్ర బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎస్పీ రఘువీర్ రెడ్డి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ట్రైనీ డీఎస్పీ రఘువీర్, ఎస్ఐ రమణయ్య సూచించారు. గురువారం చాగలమర్రి గ్రామంలో బీఎస్ఎఫ్ దళాలు, పోలీసులు కలిసి వీధుల గుండా కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 30 యాక్ట్ అమలులో ఉంటుందని చెప్పారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

టీడీపీలోకి వైసీపీ నాయకులు

ఉయ్యాలవాడ, మార్చి 21: మండలంలోని మాయలూరు గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేశారు. గురువారం గ్రామానికి చెందిన కొర్రపాటి మహేశ్వరరెడ్డి, దిద్దుకుంట్ల సుదర్శన్‌రెడ్డితో పాటు 18 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. వీరి వెంట టీడీపీ మండల అధ్యక్షుడు బోరెడ్డి శేఖర్‌రెడ్డి, కన్వీనర్ కూడాల నారాయణరెడ్డి, మండల నాయకులు మారఒరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పేరెడ్డి మోహన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇండియా కూటమిని గెలిపించండి

బేతంచెర్ల, మార్చి 21: ప్రజాస్వామ్య పరిరక్షణకై ఇండియా కూటమిని ప్రజలు గెలిపించాలని సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎస్.రంగనాయుడు పేర్కొన్నారు. పట్టణంలో సీపీఐ కార్యాలయంలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో రంగనాయుడు మాట్లాడుతూ డోన్ నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి బుగ్గన ఎంత మందికి ఉపాధి కల్పించింది చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శులు తాలుకా తిరమలేష్, దస్తగిరి, పట్టణ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

'ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి'

రుద్రవరం, మార్చి 21: గ్రామాల్లో ఇంటి గోడలకు రాజకీయ పార్టీల పోస్టర్లు, ఫ్లెక్సీల ఏర్పాటుకు ఆర్డీవో అనుమతి, ఇంటి ఓనరు అనుమతి, ఆ పార్టీ అనుమతి తప్పనిసరి అని ఎంసీసీ అధికారి రామచంద్ర తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వాటర్ సమస్య తలెత్తకుండా చూసేందుకు గ్రామ పంచాయతీల నిధులను వాడుకోవచ్చని కలెక్టరు ఆదేశాలు ఉన్నాయన్నారు. ట్యాంకర్లతో నీటి సరఫరా చేసేటప్పుడు ఆ ట్యాంకర్లు తెలుపు రంగులో ఉండాలని సూచించారు. గ్రామ వలంటీర్లు ఎక్కడైనా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు'

దొర్నిపాడు, మార్చి 21: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి హెచ్చరించారు. మండలంలోని క్రిష్టిపాడు, దొర్నిపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల నియామవళిని తప్పనిసరిగా పాటించాలన్నారు. గ్రామాల్లో రాజకీయ పార్టీల పోస్టర్లు, జెండాలు, విగ్రహాలకు ముసుగులు వేయించినట్లు తెలిపారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి నాగార్జున, లక్ష్మీ ఉన్నారు.

'ఎన్నికల నియమావళి పాటించాలి'

చాగలమర్రి, మార్చి 21: గ్రామాల్లో ఆయా పార్టీ నాయకులు ఎన్నికల నియామవళిని తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ రమణమ్మ సూచించారు. సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున జెండాలు, ఫ్లెక్సీలు ఉంచరాదని అన్నారు. గ్రామాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో పార్టీలకు సంబంధించిన పోస్టర్లను తొలగింప చేశామన్నారు.

'అడవులను సంరక్షించుకోవాలి'

రుద్రవరం, మార్చి 21: అడవులు మానవునికి జీవనాధారం, ప్రాణకోటికి మూలం అని, వాటిని సంరక్షించుకోవాలని రుద్రవరం ఫారెస్టు రేంజ్ అధికారి శ్రీపతినాయుడు సూచించారు. గురువారం రుద్రవరం ఫారెస్టు కార్యాలయ ఆవరణంలో ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. రేంజర్ మాట్లాడుతూ అడవుల్లో చెట్లు పెంపకం, వన్యప్రాణులను రక్షించడం మానవుని మనుగడకు ఎంతో ఆధారమన్నారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసరు నాగరాజు, బీట్ ఆఫీసర్లు రామకృష్ణ, నాగేంద్రయ్య, మహబూబ్‌ఖాన్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వీటికి కోడ్ వర్తించదా..?



డోన్‌లో షాదిఖానాలో ఉన్న ఈ శిలాఫలకంపై కనిపిస్తున్న మంత్రి బుగ్గన ఫొటో, ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో బోర్డుపై కనిపిస్తున్న సీఎం జగన్ ఫొటో

డోన్, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ డోన్ పట్టణంలో మంత్రి బుగ్గన సంబంధించిన పలు శిలాఫలకాలు ఇంకా అలానే కనిపిస్తున్నాయి. వీటికి కోడ్ వర్తించదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పట్టణంలోని షాదీఖానాలో ఆవిష్కరించిన శిలాఫలకంపై మంత్రి బుగ్గన ఫొటోతో పాటు పేరు కనిపిస్తుంది. శిలా ఫలకంలో కనిపించే మంత్రి ఫొటో, పేరుపై స్టిక్కర్ వేయాల్సిన అధికారులు వేయకుండా చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. అదే విధంగా గుత్తి రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బోర్డుపై సీఎం జగన్ ఫొటో అలాగే దర్శనమిస్తున్నది. అధికారులు ఎన్నికల కోడ్ నిబంధనలు అమలు చేయకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

పేదలకు జగన్ నమ్మక ద్రోహం: బీసీ



టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, మార్చి 21: రాష్టంలోని నిరు పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి సీఎం జగన్ నమ్మక ద్రోహం చేశారని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రహదారిలో ఇంటింటికి తిరిగి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు గురించి ఇంటింటికి తిరిగి వివరించారు. ఈ సందర్భంగా బీసీ మాట్లాడుతూ జగనన్న కాలనీల పేరిట కొండలు, గుట్టలు వంటి నివాస యోగ్యం కాని స్థలాలు ఇచ్చి వైసీపీ ప్రభుత్వం దగా చేసిందన్నారు. ఇంటి స్థలాలతో పాటు ఇళ్లు కూడా తామే నిర్మించి ఇస్తామని జగన్ ప్రగల్భాలు పలికి చివరికి పేదలకు ఇళ్లు లేకుండా చేశారని విమర్శించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో పొట్టిపాడు సుబ్బారెడ్డి, గడ్డం నాగేశ్వరరెడ్డి, బీవీ. ప్రసాదరెడ్డి, సౌదరదిన్నె సుబ్బారెడ్డి, అమడాల మద్దిలేటి, బిజనవేముల హుసేనయ్య, గాధంశెట్టి రమణయ్య, బాలాజీసింగ్, పెనుగొండ రాజశేఖర్, గడ్డం అమర్‌నాథరెడ్డి, కుళాయి, మురళి, సౌదరదిన్నె దస్తగిరి, జనసేన పార్టీ నాయకులు నాగప్రసాద్‌తో పాటు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.